సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం । 2 । అక్టోబర్ । 2025



న్యూస్‌రీల్

బాణసంచా తయారీలో అప్రమత్తం

కలెక్టర్ మహేష్ కుమార్



అమలాపురం రూరల్: బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలపై రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. అయినవిల్లి మండలం విలస గ్రామంలో మంగళవారం బాణసంచా ప్రమాదంలో భార్య భార్తలు మృతిచెందడం బాధాకరమని ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అన్ని శాఖల అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆయా శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాణసంచా తయారీ, నిల్వ కోసం మంజూరు చేసిన లైసెన్సులు, వాటి రెన్యూవల్ వివరాలను సమర్పించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల సిబ్బంది తమ పరిధిలోని బాణసంచా తయారీ, నిల్వ కేంద్రాలను తనిఖీ చేయాలని, రక్షణ చర్యలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

విజయ దశమి శుభాకాంక్షలు

గురువారం విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజల జీవితాలలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం విజయ దుర్గమ్మ నింపాలని కలెక్టర్ అన్నారు. ఈ మేరకు ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

రెడ్‌క్రాస్ ఎన్నికలు వాయిదా

ఈ నెల మూడో తేదీన నిర్వహించనున్న జిల్లాస్థాయి రెడ్‌క్రాస్ ఎన్నికలు అని వార్య కారణాలవల్ల వాయిదా వేసినట్టు కలెక్టర్ బుధవారం తెలిపారు. వరుసగా దసరా సెలవులు రావడం, గోదావరి నదికి వరదల వల్ల వాయిదా వేశామని, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామని ఆయన తెలిపారు.

జయజయహే మహిషాసుర మర్దిని..



మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చిన ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

రామచంద్రపురం రూరల్/అమలాపురం టౌన్: పంచారామ క్షేత్రాలు.. త్రిలింగ క్షేత్రాలు.. అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలలో పదో రోజైన బుధవారం అమ్మవారి మట్టి ప్రతిమను ఆ రూపంలో అలంకరించారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో మేలుకొలుపు, ప్రభాత సేవ, సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, తీర్థపు బిందె, బాలభోగం, ప్రధమాభిషేకం, ప్రధమార్చనల అనంతరం అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలాగే అమలాపురం పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీదేవి ఆలయం, గోల్డ్ మార్కెట్‌లోని కామాక్షీ ఏకామ్రేశ్వరీదేవి ఆలయం, వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని వైష్ణవీ కనకదుర్గ ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయం, హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గ ఆలయాల్లోని అమ్మవార్లతోపాటు కామాక్షీ పీఠంలోని శ్రీకామాక్షీదేవి మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు.



అమలాపురం గోల్డ్ మార్కెట్‌లో మహిషాసుర మర్దినిగా కామాక్షీ ఏకామ్రేశ్వరీదేవి

రేపటి నుంచి మూడో దశ రీసర్వే

అమలాపురం రూరల్: జిల్లాలో శుక్రవారం నుంచి మూడో దశ ఆంధ్రప్రదేశ్ రీ సర్వే పనులను ప్రారంభిస్తున్నట్టు డీఆర్వో కె.మాధవి బుధవారం తెలిపారు. ఈ మేరకు భూ యజమానులు వారి కమతాలకు సరిహద్దులు చూపాలని కోరారు. కొత్తపేట డివిజన్ అయినవిల్లి మండలంలో కొండకుదురు, క్రాప, కే. జగన్నాథపురం, చింతలంక అమలాపురం డివిజన్ అల్లవరం మండలంలో రెల్లుగడ్డ, తాటికోన, అమలాపురం మండలంలో సాకుర్రు, ఎ.వేమవరం, అంబాజీపేట మండలంలో కె.పెదపూడి, చిరతలపూడి, ఐ.పోలవరం మండలంలో కొమరగిరి, కాట్రేనికోన మండలంలో లక్ష్మీవాడ, మలికిపురంలో కత్తిమండ, లక్కవరం, మామిడికుదురు మండలంలో మామిడికుదురు, లూటుకుర్రు బి. దొడ్డవరం, ముమ్మిడివరం మండలంలో అనాతవరం, పి.గన్నవరం మండలంలో ముంగండపాలెం, ముంజవరం, కేదారులంక, మొండెపులంక, రాజోలు మండలంలో కాట్రేనిపాడు, సఖినేటిపల్లి మండలంలో రామేశ్వరం గ్రామాలలో ఈ సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు.

పగబట్టి పోటెత్తినట్టు



అల్లవరం మండలం బోడసకుర్రులో నీట మునిగిన మత్స్యకారుల ఇళ్లు



లంకాఫ్ ఠాన్నేల్లంక మత్స్యకార కాలనీలో జ్వరంతో ఇబ్బంది పడుతున్న మహిళను ఎత్తుకుని తీసుకువస్తున్న స్థానికుడు



సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక నుంచి టేకిశెట్టిపాలెం వెళ్లే రహదారిపై వరద నీరు

- కోనసీమ లంకల్లో వీడని వరద
- ముంపులో నానుతున్న గ్రామాలు
- ఆ నాలుగు గ్రామాలకు మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- మునుగుతున్న కాజ్ వేలు.. రోడ్లు
- ప్రయాణాలన్నీ పడవల పైనే
- పలుచోట్ల ఆగిన రేవు ప్రయాణాలు
- ఉద్యాన పంటలు.. పశుగ్రాసాలు.. వెనామీ రొయ్యలకు నష్టం

సాక్షి, అమలాపురం: గోదావరి వరద కష్టాలు వీడడం లేదు. జూలైలో మొదలైన వరద అక్టోబరు వచ్చినా కొనసాగుతోంది. ఈ ఏడాది భారీ వరద లేకున్నా ఒకసారి రెండో ప్రమాద హెచ్చరిక.. మరో నాలుగు సార్లు తొలి ప్రమాద హెచ్చరిక ప్రకటించారు. వరద వచ్చిన ప్రతిసారి గోదావరి నదీపాయల మధ్య ఉన్న లంకవాసుల కష్టాలు రెట్టింపవుతున్నాయి. గోదావరి మరోసారి పోటెత్తింది. జిల్లాలోని లంక గ్రామాలను వరద చుట్టు ముడుతోంది. 48 గంటల్లో వరద ఉధృతి భారీగా పెరిగింది. సోమవారం రాత్రి ఆరు గంటల సమయానికి ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి దిగువునకు 9,59,784 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేశారు. ఇది బుధవారం సాయంత్రం 9 గంటల సమయానికి 12,59,482 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వరదలకు మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేపై రాకపోకలు నిలిపివేశారు. ఆర్టీసీ బస్సులు, ఇతర భారీ వాహనాలు నిలిచిపోయాయి. మామిడికుదురు నుంచి ఉచ్చులవారిపేట మీదుగా కేవలం ద్విచక్ర వాహనాలకు మాత్రమే అనుమతిచ్చారు. పి.గన్నవరం, అయినవిల్లి, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాల్లో వరద ముంపు కొనసాగుతోంది. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక, కూనాలంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లి లంకల్లోని లోతట్టు కాలనీల్లో వరద నీరు చేరింది. స్థానికులు మోకాలు లోతు నీటిలో రాకపోకలు సాగిస్తున్నారు. అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలెం మత్స్యకారకాలనీ నీట మునిగింది. ఇళ్ల మధ్యకు నీరు చేరడంతో వారి కష్టాలు రెట్టింపయ్యాయి. సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం కాజ్‌వే నీట మునిగింది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు వచ్చి చేరుతోంది.

రైతులకు అంతులేని నష్టం

గోదావరికి ఐదుసార్లు తాకిన వరద లంక గ్రామాల్లోని ఉద్యాన రైతుల వెన్ను విరిచింది. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో 29 గ్రామాల్లో 2,674 మంది రైతులకు చెందిన 2,216.82 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీని విలువ సుమారు రూ.2.4 కోట్లు ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు. ముమ్మిడివరం, పి.గన్నవరం, అయినవిల్లి, కపిలేశ్వరపురం మండలాల్లో కూరగాయ పంటలు, పశుగ్రాసాలు అధికంగా నష్టం వాటిల్లింది.

మామిడికుదురు, ఐ.పోలవరం, కాట్రేనికోన, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో వెనామీకి నష్టం వాటిల్లింది. వరదలకు భయపడి కౌంట్‌కు వస్తున్న రొయ్యలను మధ్యలో పట్టుబడులు చేయాల్సి వచ్చింది.

నిలిచిన రేవు ప్రయాణాలతో కష్టాలు

జిల్లాలో కోటిపల్లి-ముక్తేశ్వరం, సఖినేటిపల్లి-నర్సాపురం, జి.మూలపాలెం-పల్లంకుర్రు, సోంపల్లి-అయోధ్యలంక, చాకలిపాలెం-దొడ్డిపట్ల రేవుల్లో ప్రయాణాలు నిలిపివేశారు. పంటులు, పడవల మీద రాకపోలు నిలిపివేయడంతో ప్రయాణికుల కష్టాలు రెట్టింపయ్యాయి. ముక్తేశ్వరం నుంచి కోటిపల్లి, రామచంద్రపురం వెళ్లే వారు ఎక్కువ. పంటు దాటితే రామచంద్రపురం 17 కిలో మీటర్ల దూరం, అటువంటిది ఇప్పుడు 60 కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. సఖినేటిపల్లి నుంచి నర్సాపురం రేవు మీదుగా 9 కిలో మీటర్లు కాగా, ఇప్పుడు 25 కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోంది.



ముమ్మిడివరం మండలం కూనాలంకలో వరద నీట మునిగిన కూరగాయ పంటలు, పశుగ్రాసాలు



సఖినేటిపల్లిరేవులో నిలిచిపోయిన పంటు

పడవల మీదనే ప్రయాణం

పి.గన్నవరం మండలం గంటి పెదపూడిలంక, అరిగెలవారిపాలెం, బూరుగు లంక, ఊడిమూడిలంక గ్రామ వాసుల వరద కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఈ ఏడాది జులై చివరి వారంలో వరద మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు స్థానికులు పడవల మీదే రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నాలుగు గ్రామాల్లో సుమారు 3,500 మందికి పైగా జీవిస్తున్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు అనారోగ్యం బారిన పడినవారు ఎవరైనా సరే పడవ మీదే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలు, పశుగ్రాసాలు, రోజువారి పాల విక్రయాలు ఇలా సర్వం పడవల మీదనే తరలించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పి.గన్నవరం మండలాన్ని ఆనుకుని ఉన్న పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని కనకాయిలంక, అనగారి లంక, శిర్రవారిలంక, అయోధ్యలంక, పుచ్చలంక వాసులు, అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక వాసులు కాజ్‌వేలు మునిగిన ప్రతిసారి పడవలను ఆశ్రయించాల్సి రావడంతో వ్యయప్రయాసలకు లోనవుతున్నారు.



పి.గన్నవరం మండలం బూరుగులంక నుంచి పడవపై లంకవాసుల రాకపోకలు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ఈ నెల ఐదున పంపిణీ చేయనున్న కాత్వా



స్కాలర్‌షిప్ కరపత్రాలను విడుదల చేస్తున్న తాతాజీ, కాత్వా జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: చదువులో ప్రతిభ కనబరుస్తున్న వెయ్యి మంది పేద కాపు విద్యార్థులకు ఈనెల 5న కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాత్వా) ఆధర్యంలో రూ.70 లక్షల విలువైన స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు జిల్లా కాత్వా అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ చేతుల మీదుగా కాత్వాకు భారీగా విరాళాలు అందజేశారు. అమలాపురంలోని కల్వకొలను వీధిలో బుధవారం జరిగిన కార్యక్రమంలో తాతాజీకి, కాత్వా ప్రతినిధులకు ఆ మొత్తాలను అందించారు. కాపు నాయకులు తాడి నరసింహారావు, బండిగుప్తాపు పాండురంగారావు, బోనం కనకయ్య, గంధం పల్లంరాజు, త్సవటపల్లి నాగబాబు, జయన సత్తిరాజు బూరి విరాళాలు అందించారు. ఈనెల 5న స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో వీటిని పంపిణీ చేయనున్నట్టు కాత్వా జిల్లా ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకోసం గుంటూరు తులసి సీడ్స్ అధినేత తులసి రామచంద్రప్రభు రూ.30 లక్షల విరాళం ఇచ్చినట్లు కాత్వా జిల్లా గౌరవాధ్యక్షుడు పప్పుల శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్ ఆలివ్ స్వీట్స్ అధినేత దొరరాజు 2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన ఒక కాపు విద్యార్థికి రూ.లక్ష నగదు బహుమతి అందివ్వనున్నారని కాత్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా స్కాలర్ షిప్‌ల పంపిణీ కర పత్రాలను విడుదల చేశారు.

రీజెన్సీ తెరిచేందుకు ప్రజా మద్దతు అవసరం

- సంస్థ ఎండీ జీఎన్ నాయుడు
- సహజవాయువు కేటాయింపునకు ప్రధానిని కలవనున్న ఎంపీల బృందం



ఆర్ఏఓతో సమావేశమైన ఎంపీ బోస్, జీఎన్ నాయుడు, ఎమ్మెల్యే అశోక్

యానాం: రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమ పునఃప్రారంభానికి పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్ ఎంపీల బృందం త్వరలో ప్రధాని మోదీని కలవనున్నట్టు ఆ సంస్థ ఎండీ డాక్టర్ జీఎన్ నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక ఐఏఎస్ అధికారి, ఆర్ఏఓ అంకిత్‌కుమార్‌ను ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్‌తో పాటు ఆయన కలిసారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏడాది క్రితం సీఎం రంగసామితో చర్చించిన అనంతరం రూ.30 కోట్ల పెట్టుబడితో మెషినరీ అమర్చినట్టు తెలపారు. గెయిల్ ద్వారా వచ్చే గ్యాస్ నిలిపివేయడంతో ఆ పైపులు తుప్పుపట్టాయని, వాటికి అయ్యే రూ.80 కోట్ల వ్యయాన్ని తామే భరిస్తామని, ఫ్యాక్టరీ ప్రారంభమైతే వచ్చే రెవెన్యూ ద్వారా ఆ మొత్తాన్ని చెల్లిస్తామని వారిని కోరినట్టు తెలిపారు. సంస్థకు సహజవాయువు కేటాయింపుపై అక్టోబర్ 15వ తేదీలోగా ఎంపీల బృందం ప్రధానిని కలవనున్నట్టు ఆయన తెలిపారు. ప్రజల నుంచి సైతం రీజెన్సీ తెరవాలని ప్రజల మద్దతు తెలిసేలా పోరాటం చేయాలని ఆయన అన్నారు. 2012 జనవరి 27న జరిగిన ఫ్యాక్టరీ విధ్వంసం తదనంతర పరిణామాలు, ఇద్దరు మృతి ఘటనలపై సీబీఐ విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాయుడు కోరారు. 665 మంది కార్మికులకు 25 ఎకరాల్లో ఇళ్లపట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. వారు సైతం వాటిలో నివాసాలకు ముందుకు రావాలని కోరారు. సమావేశంలో వారితో పాటు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ పాల్గొన్నారు.

ఏడు వీధుల ఊరేగింపునకు పటిష్ట బందోబస్తు

- 10 డ్రోన్ కెమెరాలతో నిఘా
- కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పర్యవేక్షణ
- జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



అమలాపురం టౌన్: అమలాపురంలో గురువారం జరగనున్న ఏడు వీధుల దసరా ఊరేగింపులకు పూర్తి స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఓ ప్రకటనలో తెలిపారు. ఏడు వీధుల ఊరేగింపుల కదిలికలపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు 10 డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. డ్రోన్ కెమెరాలతో పాటు సీసీ కెమెరాలు, సోలార్ సీపీ కెమెరాలు, బాడీ వోర్న్ కెమెలు, వీడియోలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశామన్నారు. అమలాపురం గడియారం స్తంభం సెంటర్‌లో దసరా ఊరేగింపుల నిరంతర పర్యవేక్షణ కోసం కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. 500 మందికి పైగా పోలీసులను బందోబస్తుకు వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. పట్టణంలో దసరా ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్‌ను కూడా మళ్లించినట్లు తెలిపారు. పట్టణంలోకి ఏ వాహనం రాకుండా ఆయా ప్రాంతాలకు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను సూచించామన్నారు. దసరా ఊరేగింపులను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా ఏడు వీధుల ఉత్సవ కమిటీల ప్రతినిధులు సహకరించాలని ఎస్పీ మీనా విజ్ఞప్తి చేశారు. కమిటీల ప్రతినిధులే అందుకు బాధ్యత వహించాలని సూచించారు.

అంధుల చదువులపై ఔదార్యం

- విద్యార్థులకు సొంత గూడు ఏర్పాటు
- రూ.60 లక్షలతో లూయీ బ్లైండ్ స్కూల్
- గత ప్రభుత్వంలో రూ.35 లక్షల కేటాయింపు

సాక్షి, అమలాపురం: అంధ విద్యార్థులకు సొంత గూడు కల్పించాలన్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది. అమలాపురంలో సుమారు 25 మంది అంధులు స్థానిక బూపయ్య అగ్రహారంలోని మున్సిపల్ పాఠశాలలో నివసిస్తూ చదువుకుంటున్నారు. రామాయణం శ్రీనివాసరావు రెండు దశాబ్దాలుగా లూయీ అంధుల పాఠశాల పేరుతో స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తూ బ్రెయిలీలో విద్యా బోధన చేస్తున్నారు. తొలుత ఇక్కడ భవనం తుపానుకు దెబ్బతినడంతో తరువాత రేకుల షెడ్ వేసి నిర్వహించారు. తరువాత వీరు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోగా, సొంత గూడు కల్పించాలని శ్రీనివాసరావు గత ప్రభుత్వంలో నాటి మంత్రి పినిపే విశ్వరూప్‌ను కలిసి అభ్యర్థించారు. చమురు సంస్థలకు చెందిన సీఎస్సార్ నిధులు రూ.20 లక్షలు, ఓఎన్జీసీ నుంచి రూ.పది లక్షల చొప్పున మొత్తం రూ.30 లక్షలు కేటాయించారు. అలాగే మాజీ ఎంపీ చింతా అనూరాధ రూ.ఐదు లక్షల ఎంపీ నిధులు కేటాయించారు. ఇలా మొత్తం రూ.60 లక్షలలో సింహభాగం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించింది. పంచాయతీ రాజ్ ప్రాజెక్టు విభాగం ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభించి గత ప్రభుత్వ హయాంలోనే ఓ కొలిక్కి తీసుకువచ్చింది. అనంతరం ప్రభుత్వం మారిన తరువాత ఏడాదిన్నర కాలానికి పూర్తి చేశారు. ఈ భవనాన్ని 5,900 చదరపు గజాలలో నిర్మించారు. ఒక గది 40 ఇన్‌టు 18, మరో గది 22 ఇన్‌టు 18 చొప్పున నిర్మించారు. విశాలమైన వంట గది ఉంది. ఈ భవనాన్ని బుధవారం రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎంపీ గంటి హరీష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు ప్రారంభించారు.



లూయీ అంధుల పాఠశాల భవనం



క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

తుని రూరల్: రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. 45 సంవత్సరాల వయసు కలిగిన వ్యక్తి గొల్లప్రోలు, రావికంపాడు రైల్వేస్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ముదురు గోధుమ రంగు ఫ్యాంటు, తెలుపు, పసుపు, గోధుమ రంగు గడుల చొక్కా ధరించి ఉన్నాడు. మృత దేహాన్ని తుని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచారు. వివరాలు తెలిసిన వారు 94916 19020 నంబరును సంప్రదించాలన్నారు.

చీటీల బుజ్జికి రిమాండ్

ఐ.పోలవరం: చీటీల పేరుతో కొట్లాది రూపాయలు మేర పలువురిని మోసం చేసి పరారైన చింతలపూడి వీరశంకరరావు (బుజ్జి)ని ఐ పోలవరం ఎస్సై ఎం.రవీంద్రబాబు మురమళ్లలో అదుపులోకి తీసుకున్నారు. బుజ్జిపై పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. మేజిస్ట్రేట్ అతడికి 15 రోజులు రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

ఐ.పోలవరం పోలీసు స్టేషన్ సందర్శన

ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా బుధవారం సాయంత్రం సందర్శించి కేసుల వివరాలు, శాంతి భద్రతలపై సీఐ ఎం.మోహన్ కుమార్, ఎస్సై ఎం.రవీంద్ర బాబులను ఆరా తీశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ జిల్లాలోని పోలీస్ స్టేషన్లో పరిశీలించి జిల్లా పరిస్థితులపై ఆరా తీస్తున్నారు.

కాలువలో దూకి వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

నిడదవోలు రూరల్: స్థానిక ఓవర్‌బ్రిడ్జిపై నుంచి పశ్చిమ డెల్టా కాల్వలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వృద్ధుడిని బుధవారం స్థానిక యువకుడు రక్షించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళానికి చెందిన రేగడి సింహాచలం కుటుంబ సమస్యలతో మనస్తాపానికి గురై కాల్వలోకి దూకడంతో స్థానిక యువకుడు ఓలా వెంకటేశ్వర్లు ప్రాణాలకు తెగించి కాపాడాడు. సమిశ్రగూడెం పోలీసులు వచ్చి వృద్ధుడి వివరాలు సేకరించి నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

వరి చేలపై తెగుళ్ల దాడి

- వాతావరణంలో వచ్చిన మార్పులే కారణం
- నష్టనివారణ చర్యలు వెంటనే చేపట్టాలి
- ఏరువాక శాస్త్రవేత్త నరసింహారావు



నర్సింహారావు
జిల్లా ఏరువాక శాస్త్రవేత్త, రాజమహేంద్రవరం



పెరవలిలో ఎండాకు తెగులు సోకి ఎండిపోతున్న వరి చేను



ఉసులుమర్రులో సుడి దోమ ఆశించి ఎండిపోతున్న వరిచేను

పాడి-పంట

పెరవలి: అధిక వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల వలన వాతావరణంలో వచ్చిన మార్పులతో వరి చేలపై తెగుళ్ల ఆశించటంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. జిల్లాలో వరిని ఖరీఫ్ పంటగా 1.85 లక్షల ఎకరాల్లో సాగు చేస్తుండగా నిడదవోలు నియోజకవర్గం లో 36 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఈ పంటపై ఆశించే తెగుళ్ల, వాటి నివారణ చర్యలపై జిల్లా ఏరువాక శాస్త్రవేత్త సీహెచ్ వి నర్సింహారావు వివరించారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఎండ, చల్లదనం వల్ల ఖరీఫ్ వరి పంటపై ఎండాకు తెగులు, సుడిదోమ, తుప్పు తెగులు, మాగుడు వంటివి ఎక్కువగా ఆశించాయన్నారు. అధిక వర్షాలు వల్ల తెగుళ్ళను తట్టుకోలేని బీపీటీ 5204, పీఎల్‌పి 1100, ఎంటీయూ 1318, 1282, 1121, 1224 రకాలు, స్వర్ణ, పీఆర్ 126 రకాల సాగులో అధిక నత్రజని వాడకం, పొటాష్ వాడకపోవటం వల్ల తెగుళ్ల వ్యాప్తి చెందుతున్నాయన్నారు.

ఎండాకు తెగులు

ఈ తెగులు బాక్టీరియా వల్ల వస్తుంది. ఇది ఆకుల అంచుల నుంచి పసుపురంగుకి మారి క్రమేపీ ఎండిపోతాయి. ఈ తెగులు ఎక్కువగా అధిక వర్షాలు కురిసినప్పుడు, గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు ఆశిస్తుంది.

నివారణ చర్యలు

ఈ తెగుళ్ల నివారణకు సరైన మందులు లేవు. బాక్టీరీయాను అరికట్టడానికి కొన్ని రకాల మందులు మాత్రమే ఉన్నాయి. ఎండాకు తెగులు సోకిన చేలు చూస్తుండగానే ఎండిపోతాయి. దీనిని అరికట్టడానికి కాఫర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాఫర్ హైడ్రాక్సాడ్ మందును ఎకరాకు 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తరువాత మళ్లీ కనిపిస్తే రెండు వారాల తరువాత మరోసారి పిచికారీ చేయాలి. ఈ మందును పిచికారీ చేసినప్పుడు మరో మందును కలిపి వాడకూడదు.

మాగుడు లేక పొడతెగులు

గ్రామీణ ప్రాంతాల్లో ఈ తెగులును మాగుడు లేక పొడ తెగులు అంటారు. అధిక ఎండలు, గాలిలో తేమ శాతం 90 శాతం ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఇది ఆశించిన చేను చూస్తుండగానే ఎండిపోతుంది.

నివారణ చర్యలు

పంటలోఎంతమేర ఈ తెగులు సోకిందనేది రైతులు గుర్తించాలి. దీని నివారణకు ఎకరానికి ఎక్సోకానోజాల్ 400 మిల్లీలీటర్లు పిచికారీ చేయాలి. లేదా పిప్రీకొనోజాల్ 200 మిల్లీలీటర్లు లేదా వాలిడామైసిన్ 400 మిల్లీలీటర్లు ఒక మిల్లీలీటరుకు 2 లీటర్ల నీటిని కలిపి పిచికారీ చేయాలి. వీటిని రెండవ దఫాగా 15రోజులకు పిచికారీ చేయాలి.



కాకరపర్రులో అగ్గి తెగులు సోకిన వరిచేను

తుప్పు తెగులు

ఈ తెగులు ఆశించిన వరి ఆకులపై గోధుమ వర్ణంలో తుప్పు పట్టినట్లుగా మచ్చలు ఏర్పడి క్రమేపీ పెద్దవి అయి ఆకులో పత్రహరితం లేకుండా పోతుంది. ఇలా అవ్వటం వల్ల ఆకులు ఎండిపోయి క్రమేపీ దుబ్బు కూడ ఎండిపోతుంది. ఈ తెగులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చూస్తుండగానే చేను ఎండిపోతుంది.

నివారణ చర్యలు

ఎకరానికి కార్బండిజమ్ 250 గ్రాములు తీసుకుని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు. పిచికారీ చేసిన వారం రోజులకు మచ్చలు ఇంకా ఉంటే మరో దఫా పిచికారీ చేయాలి.

అగ్గి తెగులు

ఈ తెగులు గాలిలో తేమ శాతం అధికంగా ఉన్నప్పుడు వ్యాప్తి చెందుతుంది. ఇది ఆశించిన చేలు ఆకులపై ముదురు గోధుమ మచ్చలు, ఆకులు ఎండిపోయి తగులబడినట్లుగా కనిపిస్తాయి. వెన్ను మెడభాగంలో ఈ తెగులు వ్యాపిస్తుంది. వెన్ను విరిగిపోతుంది. అంతేకాకుండా ఎరువుల్లో నత్రజని ఎక్కువైనప్పుడు కూడ ఈ తెగులు ఆశిస్తుంది.

నివారణ చర్యలు

ఈ తెగులు ఆశించిన చేల చుట్టూ గట్లపై గడ్డిని నివారించాలి. ట్రైసైక్లోజోల్ 6 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు.

సుడిదోమ

సుడిదోమ కాండం మొదలకు చేరి రసం పీల్చివేయటంతో ఆకులు పసుపు రంగులోకి మారిపోయి సుడులు సుడులుగా ఎండిపోతుంది. దీనిని త్వరగా అరికట్టపోతే చేను అంతా ఎండిపోతుంది.

నివారణ చర్యలు

వరిదుబ్బుకి దోమలు 10 నుంచి 15 ఉంటే ఎకరానికి పై మెట్రోజోల్ 120 మిల్లీలీటర్లు మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిదుబ్బుకి 25 నుండి 50 దోమలు ఉంటే ఎకరానికి హితోఫిన్ ప్లాక్స్ 300 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. వరిదుబ్బుకి 50 దోమలు దాటితే దీని తీవ్రత ఎక్కువగా ఉంటుంది దీని నివారణకు ఎకరానికి ఎస్పేట్ 300 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారించవచ్చు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన ర్యాలీ



డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యులు బుధవారం బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం నుంచి సెంటర్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ పీహెచ్‌సీ వైద్యుల అసోసియేషన్ నేతలు డాక్టర్లు సిరాజ్, భావన, తిరణ్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పీహెచ్‌సీల్లో వైద్యాధికారులుగా పనిచేస్తున్న వారికి పీజీ సీట్లలో 30 శాతం కోటా ఉండేదన్నారు. దీనిని కూటమి ప్రభుత్వం 15 శాతానికి తగ్గించిందన్నారు. దీనిపై ఆందోళన చేస్తే 20 శాతానికి ప్రభుత్వం పెంచిందన్నారు. దానిని ఒక ఏడాది మాత్రమే అమలు చేసి ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2020లో ఉద్యోగంలో చేరిన వైద్యులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వడం లేదన్నారు. 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వైద్యులకు ప్రమోషన్లు సైతం ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు అమలు చేసే వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. ఇప్పటికే పీహెచ్‌సీల్లో అత్యవసర సేవలు మినహా ఓపీ సేవలను బంద్ చేయడం జరిగిందన్నారు. ఈ నిరసనలో అధిక సంఖ్యలో పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

పెద్దలకు భయపడి ప్రాణాలు తీసుకున్నారు

ప్రేమజంట ఆత్మహత్యతో దుర్గాడలో విషాదఛాయలు



ఘటన స్థలంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అశోక్ (ఫైల్)



దీప్తి (ఫైల్)

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన యువతీ యువకుల ఆత్మహత్యతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పెద్దలు తమ ప్రేమను ఒప్పుకోరన్న అనుమానంతో వారు ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్టు తెలుస్తోంది. ఉద్యోగం వస్తే ఇద్దరం ఒకటవ్వాలని ఎన్నో కలలు కన్న వారి ఆశలను ఎవరైనా తుంచేస్తారేమోనని భావించి పోతే కలిసే పోవాలనుకున్నారో ఏమో.. కలసికట్టుగా నిర్ణయం తీసుకుని తనువు చాలించారు. దుర్గాడకు చెందిన గొల్లపల్లి దీప్తి (17)ని కొమ్మూరి అశోక్ (25) అనే యువకుడు సామర్లకోటలో గొంతు కోసి చంపి, అనంతరం తాను సైతం ఆత్మహత్య చేసుకున్న ఘటనతో బుధవారం దుర్గాడలో కలకలం రేపింది. సామర్లకోట పోలీసులు, మృతుల బంధువులు తెలిపిన సమాచారం మేరకు అశోక్‌కు తల్లి, తండ్రి, అక్క ఉండగా దీప్తికి తల్లి, తండ్రి, తమ్ముడు ఉన్నారు. దీప్తి ఇంటర్ చదువుతుండగా అశోక్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వీరిద్దరూ పేద కుటుంబాలకు చెందిన వారే.

కులాంతర ప్రేమే ప్రాణాలు తీసిందా?

ఆ యువతీ యువకులిద్దరూ కొంత కాలంగా ప్రేమలో ఉన్నట్లు సమాచారం. అశోక్‌కు 20 రోజుల క్రితం చెన్నైలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరి దసరాకు సెలవుపై మంగళవారం తన స్వగ్రామం దుర్గాడ వచ్చాడు. దీప్తి సైతం సెలవుల సందర్భంగా కాకినాడలో తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. మంగళవారం రాత్రి తన బంధువులతో కలిసి కాకినాడలో షాపింగ్‌కు వెళ్లిన దీప్తికి తన అక్క ఫోన్‌కు అశోక్ మెసేజ్ చేసినట్టు తెలిసింది. దీంతో ఆమె తన స్నేహితురాలి నుంచి మెసేజ్ వచ్చిందని, వెళ్లి వస్తానంటూ కాకినాడలో తన కూడా వచ్చిన వారికి చెప్పి వెళ్లింది. అయితే ఎంత సేపటికీ ఆమె తిరిగి రాకపోవడంతో కంగారు పడిన ఆమె భంధువులు ఆమె కోసం గాలించారు. ఇదే సమయంలో అశోక్ తాను చనిపోతున్నానంటూ తన బంధువులకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో వారంతా అతని కోసం గాలింపు ప్రారంభించారు. అతని సెల్ స్విచ్ ఆఫ్ వారంతా కంగారు పడ్డారు. బుధవారం ఉదయానికి వారిద్దరు మృతి చెందినట్లు సామర్లకోట పోలీసులు ద్వారా సమాచారం అందింది.

కాగా కొంత కాలంగా వీరు ప్రేమించుకుంటున్నట్టు చెప్తున్నారు. తనకు ఉద్యోగం వస్తే పెళ్లి చేసుకోవచ్చని నిర్ణయించుకున్నారని, ఈ నేపథ్యంలో అశోక్‌కు ఉద్యగం రావడంతో పెళ్లి ప్రసక్తి తీసుకురాగా ఇద్దరివీ వేరే సామాజిక వర్గాలు కావడంతో ఇంటి దగ్గర వారు ఒప్పుకోరన్న భయంతో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

ఎన్జీఓ నాయకుల పర్యటన విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ఎన్జీఓ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.విద్యాసాగర్, డీవీ రమణ ఈ నెల 8న రాజమహేంద్రవరం రానున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని నగర ఎన్జీఓ సంఘ సమావేశం పిలుపునిచ్చింది. బుధవారం సంఘ నగర ఇన్‌చార్జి అధ్యక్షుడు పి.అనిల్ కుమార్ అధ్యక్షతన ఎన్జీఓ హోంలో సమావేశం నిర్వహించారు. నూతన జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ఏపీ ఎన్జీఓ సంఘ అడహక్ కమిటీని నియమిస్తారన్నారు. రాష్ట్ర అధ్యక్షుల బాధ్యత తీసుకున్న విద్యాసాగర్ తొలిసారిగా నగరానికి వస్తున్న సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర జేఏసీ కార్యదర్శి వేణుమాధవ రావు అన్నారు. రాష్ట్ర జేఏసీ నాయకుల పర్యటనను విజయవంతం చేయాలని నగర ఎన్జీఓ సంఘ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడేది ఏపీ ఎన్జీఓ సంఘం ఒకటేనని మహిళా సంఘ చైర్మన్ సత్యవతి అన్నారు. ఎన్జీఓ సంఘ ప్రతినిధులు రాఘవరావు, ఆనంద్, సత్యమూర్తి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యంత అవినీతి ఎమ్మెల్యే ఆదిరెడ్డి

- మాజీ ఎంపీ భరత్‌రామ్ ధ్వజం

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో అత్యంత అవినీతి ఎమ్మెల్యేగా నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మొదటి వరుసలో నిలుస్తారని, తన అనుచరులతో కలసి ప్రతి పనికీ కమీషన్లు తీసుకుంటున్నారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో 10, 15 అడుగుల నిడివి గల వీధుల్లో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు జరుగుతున్నాయని, దానికి ఎమ్మెల్యే అండ దండలున్నాయని అన్నారు. అనుమతి ఇచ్చిన దాని కంటే అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో టీడీపీ వార్డు ఇన్‌చార్జులు రూ.లక్షలకు లక్షలు అదనపు ఫ్లోర్‌ల కోసం బహిరంగంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న వాటికి ఒక్క నోటీసు కూడా వెళ్లలేదని, ఆన్‌లైన్‌లో చూస్తే తెలుస్తుందన్నారు. ఇంత పెద్ద నగరానికి మున్సిపల్ కమిషనర్‌ను వేసుకోలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానానికి ఏర్పాట్లు

- 18 మంది ప్రముఖులతో కమిటీ
- శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధుల వెల్లడి



సభలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: ఏటా మాదిరిగానే దసరా నుంచి సంక్రాంతి వరకూ స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. బుధవారం అయ్యప్ప ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్మశాస్తా ఆధ్యాత్మిక సంస్థ నిర్వాహకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి 18 మంది ప్రముఖులతో కమిటీని 2025–26 సంవత్సరానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు గోదావరి తీరాన అయ్యప్ప ఆలయం నిర్మించడానికి సంకల్పించి ప్రముఖులతో కమిటీ వేసి, ఏడేళ్ల పాటు శ్రమించి వెయ్యేళ్లు నిలిచేలా పూర్తి చేయించారన్నారు. 2011 మార్చి 20న ఆలయం ప్రారంభించారని, అదే ఏడాది అక్టోబరు 6న అన్నదానం కూడా ప్రారంభించి అయ్యప్ప భక్తులకు ఏటా అన్నదానం జరగాలని సూచించారన్నారు. ధర్మకర్త చల్లా శంకరరావు మాట్లాడుతూ మాలధారణ చేసిన భక్తులకు ఇక్కడ నిత్యం అన్నదానం జరగాలన్న జక్కంపూడి సంకల్పం మేరకు అన్నదానం చేస్తున్నామన్నారు. వచ్చిన విరాళాలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై వచ్చే వడ్డీని కూడా డిపాజిట్ చేస్తున్నామన్నారు. ఆ విధంగా ఇప్పటికీ రూ.1.30 కోట్లు డిపాజిట్ చేశామన్నారు. ఏటా అన్నదానానికి తన వంతుగా మంతెన కేశవరాజు రూ.లక్ష మొదట విరాళం ఇస్తున్నారన్నారు. ధర్మకర్త పాలసానపల్లి హనుమంతరావు మాట్లాడుతూ ఏటా దసరా నుంచి సంక్రాంతి వరకు అయ్యప్ప, భవానీ, శివ భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ తన తండ్రి జక్కంపూడి ఏడేళ్లు శ్రమించి అయ్యప్ప ఆలయ నిర్మాణం పూర్తి చేయడమే కాకుండా అన్నదానం కూడా జరగాలని భావించారన్నారు. రోజుకు సగటున వెయ్యి మంది చొప్పున వంద రోజుల్లో లక్ష మందికి పైగా భోజన వితరణ చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఇంకా పక్కాగా జరగాలన్న ఉద్దేశంతో 2025–26 సంవత్సరానికి 18 మంది ప్రముఖులతో కమిటీ వేశామన్నారు. కమిటీ సభ్యులుగా టీటీడీ బోర్డు మెంబర్ అక్కిన మునికోటేశ్వరరావు, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, డాక్టర్ గుడూరి శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రామరాజు, కూర్మదాసు ప్రభాకర్, నందెపు శ్రీనివాస్, బూర్లగడ్డ సుబ్బారాయుడు, ఆకుల శ్రీనివాస్, అయ్యల గోపి, మన్యం సంతోష్ ఫణికుమార్, చింతా ఎన్జీ ఎస్ ప్రసాదరెడ్డి, ముద్రగడ రామ్‌ప్రకాష్, కొమ్ముల సత్యసాయి చక్రవర్తి, మదన్ పురోహిత్, కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, మన్యం ఎన్వీ నవీన్‌కుమార్, హనుమాన్ సింగ్‌రాజ్ పురోహిత్, బాలనాగు సుభాష్‌లతో కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

భిక్షాటన.. బుడగల విక్రయమే జీవనం


- చదువుకోమంటే చస్తాం
- గాంధీ వేషధారుని వెదుకులాటలో అధికారులకు చేదు అనుభవం
- వారిని రక్కేసి ఉడాయించిన వైనం
- చదువు విలువ చెప్పినా వినని బాలల తల్లిదండ్రులు
- ఓ రాజస్థాన్ కుటుంబానికి నచ్చచెప్పడానికి విఫలయత్నం



బుడగలు విక్రయిస్తున్న బాలలతో మాట కలుపుతున్న పీవో విజయ, కౌన్సిలర్ దుర్గారాణి

కాకినాడ క్రైం: గాంధీ వేషధారణలో భిక్షాటన చేసిన బాలుడిని వెదికి పట్టుకున్న బాలల సంరక్షణ అధికారులు, సిబ్బందికి చేదు అనుభవం ఎదురైంది. గత నెల 29న సామాజిక మాధ్యమాల్లో కాకినాడ మెయిన్ రోడ్‌లో ఓ బాలుడు గాంధీ వేషధారణలో భిక్షాటన చేస్తున్నాడనే పోస్టు వైరల్ అయింది. తక్షణమే స్పందించిన డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ డీసీపీవో వెంకట్ ఆధ్వర్యంలో బృందం బాలుడి జాడ కోసం వెదుకులాట మొదలుపెట్టింది. అందులో భాగంగా బాలుడి జాడ కోసం అన్వేషిస్తున్నారు. ఎట్టకేలకు బుధవారం పీవో ఎన్ఐసీ విజయ తన బృందంతో కలిసి బాలుడి జాడ కనుగొన్నారు. కౌన్సిలర్ దుర్గారాణితో కలిసి కాకినాడ మెయిన్ రోడ్‌లో బుడగలు విక్రయిస్తున్న బాలుడ్ని సమీపించారు. అధికారులను గుర్తించిన ఆరేళ్ల బాలుడితో పాటు ఎనిమిదేళ్ల వయసున్న అతడి ఇద్దరు సోదరులు సదరు అధికారులు విజయ, దుర్గారాణిలపై దాడికి యత్నించారు. గోళ్లతో రక్కి పారిపోయారు. వారిని వెంబడించగా నిర్మాణంలో ఉన్న ఓ భవనంలోకి వెళ్లారు. పై అంతస్తులో పిట్టగోడ సహా ఎటువంటి భద్రత లేని టెర్రస్‌లో రాజస్థాన్‌కు చెందిన రెండు కుటుంబాలు నివసిస్తున్నట్లు పీవో, కౌన్సిలర్ గుర్తించారు. అక్కడ 4–8 ఏళ్ల మధ్య వయసున్న ఆరుగురు పిల్లలు వారి తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నారు. బాలలకు నచ్చజెప్పి భిక్షాటన మానేయాలని, బుడగలు విక్రయించొద్దని, చదువుకోమని, ప్రభుత్వం చదివిస్తుందని చెప్తుండగా తక్షణమే ఇక్కడి నుంచి వెళ్లకపోతే భవనంపై నుంచి కింది దూకేస్తామని బెదిరించారు. కంగారు పడ్డ అధికారులు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లల్ని చదివించి మంచి భవిష్యత్ ఇవ్వాలని కోరారు. అందుకు తాము సహకరిస్తామని భరోసా ఇచ్చారు. ఆ మాటలు వినని కుటుంబీకులు తాము రాజస్థాన్ నుంచి వచ్చామని దీపావళి వరకు ఉండి తిరిగి తమ స్వగ్రామానికి వెళ్లిపోతామని చెప్పారు. భాష సమస్య కావడంతో బాలల్ని స్థానిక పాఠశాలలకు పంపలేమని తేల్చి చెప్పారు. తాము నిరుపేదలమని అందుకే పిల్లల చేత భిక్షాటన, బుడగల విక్రయాలు చేయిస్తున్నామని, తమ జీవనాధారం అదేనని చెప్పారు. దీంతో ఏం చేయాలో పీవో, కౌన్సిలర్లకు పాలుపోలేదు. తక్షణమే డీసీపీవో వెంకట్‌కు సమాచారం అందించగా ఆయన పీడీ లక్ష్మికి జరిగిన విషయాన్ని తెలియజేశారు. ఆమె కలెక్టర్ దృష్టికి విషయాన్ని చేర్చి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్టు డీసీపీవో వెల్లడించారు. ఈ రెస్క్యూలో తమ సిబ్బంది విజయ, దుర్గారాణిలు గాయపడ్డారన్నారు. సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్న విధంగా గాంధీ వేష ధారణలో ఉన్న బాలుడి కోసం ఎటువంటి కాల్ రాలేదని స్పష్టం చేశారు. అయినా సమాచారం ఆధారంగా రెస్క్యూ నిర్వహించామన్నారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో సీహెచ్‌ఎల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, కేస్ వర్కర్ లక్ష్మి, అవుట్‌రీచ్ వర్కర్ దుర్గాభవాని పాల్గొన్నారని డీసీపీవో తెలిపారు.

కుక్క కడుపులో రాయి తొలగింపు



కడుపులో నుంచి తీసిన 100 గ్రాముల రాయి



పమేరియన్‌కు శస్త్రచికిత్స చేసి స్టోన్ తీసిన పశు వైద్యశాల సహాయ సంచాలకుడు సత్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతానికి చెందిన కోన పరసు రామన్‌కు చెందిన నాలుగేళ్ల మినీ పమేరియన్ డాగ్‌కు స్థానిక ఏరియా పశు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేసి కడుపులో ఉన్న వంద గ్రాముల బరువైన రాయిని తొలగించారు. పశు వైద్యశాల సహాయ సంచాలకుడు సత్యనారాయణ నేతృత్వంలో డాక్టర్లు యోగానంద్, రాజశేఖర్‌ల బృందం కుక్కకు స్కానింగ్ చేసి రాయి ఉన్నట్లు గుర్తించి బుధవారం శస్త్రచికిత్స వాటిని తొలగించారు. నాలుగు కిలోల బరువు కల్గిన ఆ కుక్క కడుపులో 100 గ్రాముల బరువున్న రాయిని తీశారు. వంశపారంపర్యంగా, తక్కువ నీరు తాగడం, మాంసాహార అలవాట్లు వల్ల ఈ స్టోన్స్ వస్తుంటాయని సత్యనారాయణ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ డైరెక్ట్ 10th, Inter (వయసు 18) డిగ్రీ (All), PG (All) అడ్మిషన్ గైడెన్స్, డిప్లొమో, B.Tech, M.Tech,DBM, ఫార్మసీ, M.Phill, Phd, BAMS, BHMS. ✆ 81431 00455, 73969 95332 [G-285]

■ Join B.Sc Ai / CSc over 60%, Maths in 10+2 get 5000 fee discount Join M.Com/ MA Eng/MSW by 6/10, 3000 fee dis, 9177408565 [SCA25008618]

Wanted

■ వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం: రూ.15,000/- + డైలీ రూ.100/-, (వివాహమైన స్థానిక అభ్యర్థులు మాత్రమే) శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్ : హోండా టూ వీలర్స్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, మెయిన్ రోడ్, కాకినాడ. ✆ : 94909 98888 [R-92]

■ కేర్ టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో ప్రముఖ హోమ్‌కేర్ ఆఫీస్ కి ఇంటి వద్దనే ఉండి పెద్దవారిని చూసుకోనుటకు అనుభవంగల స్టాఫ్ కావలెను. ✆ 916083 5559, 99121 15559 [B-279]

Real Estate

FLAT FOR SALE

■ ఫ్లాట్ అమ్మకం. రాజమండ్రి ఏ.వి. అప్పారావు రోడ్, మహలక్ష్మి టెంపుల్ వీధి, ఆక్సిజన్ టవర్స్, 1590Sft మొబైల్ 9490736691. [HA-16168]

HOUSE FOR SALE

■ రాజానగరం నియోజకవర్గం కోరుకొండ గ్రామం, బొండాడ వారి వీధి లో 270 చ॥గ॥ స్థలంలో ఉన్న పెంకుటిల్లుతో సహా స్థలం అమ్మబడును ✆ : 94932 89456, 99851 56495 [SCA25008471]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.